సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 31 । అక్టోబర్ । 2024



బడుగు జీవులపై 'పిడుగు'

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలో పిడుగు వల్ల బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. 8లో ▸



హైవే పక్కనే మద్యం దుకాణం

నూజివీడు మండలం మీర్జాపురంలో హైవే పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో ▸



ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా..!

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా అయ్యాయి. జూనియర్ అసిస్టెంట్ సంతకాలు ఫోర్జరీ చేసి రూ.62 లక్షలు కాజేసినట్లు సమాచారం. 8లో ▸

కానరాని దీపావళి కాంతులు

- వనుల్లేక, అధిక ధరలతో పేద వర్గాల ఇబ్బందులు
- అమ్మకాలు లేక బాణసంచా దుకాణాల వెలవెల
- ఏటా జిల్లాలో రూ.35 కోట్ల వరకు దీపావళి వ్యాపారం
- ఇంతవరకు 30 శాతం కూడా జరగని అమ్మకాలు
- ఆందోళన కలిగిస్తున్న వాతావరణం



నరసాపురంలో అమ్మకాలు లేక వెలవెలబోతున్న దుకాణాలు

సాక్షి, భీమవరం: ఒకవైపు పనుల్లేవు.. మరోవైపు నిత్యావసరాలు, కూరగాయల ధరలు చుక్కలనంటాయి. ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. దీంతో పేదల ఇంట దీపావళి పండుగ కాంతులు కరువయ్యాయి. అమ్మకాలు లేక బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. రెండు రోజుల్లో 30 శాతం అమ్మకాలు కూడా జరగలేదు. గురువారం అమ్మకాలపైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. చీకట్లను పారదోలి వెలుగులు పంచే దీపావళిని ప్రతీ ఇంటా వేడుకగా జరుపుకుంటారు. ధనిక పేద తారతమ్యం లేకుండా అందరూ బాణసంచా కాలుస్తారు. జిల్లాలో లైసెన్స్ కలిగిన బాణసంచా తయారీ కేంద్రాలు ఏడు ఉండగా, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, మార్టేరు, నరసాపురం తదితరచోట్ల హోల్‌సేల్ దుకాణాలు 24 ఉన్నాయి. జిల్లాలో రూ.35 కోట్లు మేర బాణాసంచా వ్యాపారం జరుగుతుందని అంచనా. పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి అమ్మకాలు ప్రారంభించారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలు ఆర్జించే వీలుండటంతో చిరు వ్యాపారులు, నిరుద్యోగ యువత రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల పెట్టుబడితో రిటైల్ షాపులు ఏర్పాటు చేస్తుంటారు. మూడు రోజుల కాల పరిమితిపై ఈ ఏడాది జిల్లాలో 366 రిటైల్ షాపులకు అధికారులు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశారు.

దుకాణాలు వెలవెల

ఏటా మాదిరి భీమవరం, తణుకు, నరసాపురం తదితర పట్టణాలు, గ్రామాల్లోని ఎంపిక చేసిన ప్రదేశాల్లో మంగళవారం నుంచి వ్యాపారులు తాత్కాలిక లైసెన్స్ షాపులను ప్రారంభించారు. సాధారణంగా షాపులు ఖాళీగా ఉండి నచ్చిన ఐటమ్స్ ఎంపిక చేసుకునే వీలుంటుందని చాలామంది ముందుగానే బాణసంచా కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో దీపావళికి ముందే 50 శాతానికి పైగా అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. **బుధవారం నాటికి 30 శాతం కూడా అమ్మకాలు జరగలేదని వ్యాపారులు అంటున్నారు. టెంపరరీ లైసెన్సుల నిమిత్తం పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు. టెంట్లు. షామి**యానాల రూపంలో ఒక్కో షాపు ఏర్పాటుకు రూ.70 వేలు నుంచి రూ. లక్ష వరకు ఖర్చయ్యింది. లక్షలు పెట్టుబడి పెట్టామని, బాణసంచా సామగ్రి అమ్ముడుపోకుంటే తీవ్రంగా నష్టపోతామని వారు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల అమ్మకాలు తీవ్రంగా నిరాశపర్చగా గురువారం వ్యాపారంపై గంపెడాసలు పెట్టుకున్నారు. అల్పపీడనం ప్రభావంతో బుధవారం జిల్లాలోని పలుచోట్ల వర్షం కురవడంతో షాపుల్లోని బాణసంచా తడవకుండా కాపాడుకునేందుకు వ్యాపారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. గురువారం వాతావరణం అనుకూలించి అమ్మకాలు బాగుంటేనే గట్టెక్కుతామని అంటున్నారు.

కనిపించని జోష్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద వర్గాలకు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుజేసింది. కూటమి పాలనలో సంక్షేమం జాడ లేకుండా పోయింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇస్తామంటూ ఊదరగొట్టిన కూటమి ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదు. నాలుగు నెలలుగా ఇసుక కొరతతో నిర్మాణ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ కోసం అయినకాడికి అప్పులు చేస్తున్న పరిస్థితి. మరోపక్క అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు వారి జీవన ప్రమాణాలను మరింత దుర్భరంగా మార్చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో బాణసంచా కొనుగోలుకు వారు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

అమ్మకాలు తగ్గిపోయాయి



ఈ ఏడాది బాణసంచా అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. గతంలో దీపావళికి ముందుగానే తణుకు ప్రాంతంలో రూ.10 కోట్ల వరకు వ్యాపారం జరిగేది. ఇప్పుడు సగానికి పైగా తగ్గిపోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి.

– పులపర్తి అజయ్‌రామ్, హోల్‌సేల్ వ్యాపారి, తణుకు

పనుల్లేక ఇబ్బంది



కొద్దినెలలుగా సరిగా పనులు లేక ఖాళీగా ఉంటున్నాం. దీనికి తోడు కూరగాయలు, సరుకుల ధరలు బాగా పెరిగిపోవడంతో కుటుంబ పోషణకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ సంవత్సరం పండుగ ఆనందం లేదు.

– ఎం.రామూనాయుడు, కూలీ, నరసాపురం

పోలీసుల రన్ ఫర్ యూనిటీ



భీమవరం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం భీమవరంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి జెండా ఊపి ప్రారంభించారు. ప్రకాశం చౌక్ సెంటర్ వద్ద ప్రారంభమైన రన్ అంబేడ్కర్ సెంటర్, బొంబే స్వీట్స్ కూడలి మీదుగా పాత బస్టాండ్ వరకు సాగింది. ఎస్పీ అస్మి మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 21న ప్రారంభమైన అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాలు 31 వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, పోలీసు సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందచేశారు.

11న జెడ్పీ అత్యవసర సమావేశం

ఏలూరు(మెట్రో): నవంబర్ 11వ తేదీన ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. జెడ్పీ చైర్‌పర్సన్ వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికై టీడీపీలో చేరడంతో ఇటీవల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నోటీసులిచ్చారు. వారి అభ్యర్థన మేరకు నవంబర్ 11న ఏలూరు జిల్లా పరిషత్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ సీఈవో తెలిపారు.

న్యూస్‌రీల్

కౌశల్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం



డీఈఓ కార్యాలయంలో కౌశల్ ప్రతిభా అన్వేషణ పరీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కౌశల్ రాష్ట్ర స్థాయి ప్రతిభా అన్వేషణ పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. బుధవారం డీఈవో కార్యాలయంలో కౌశల్ 2024 పోస్టర్ ఆవిష్కరించారు. కౌశల్ జిల్లా సమన్వయ అధికారి ఆచంట వరప్రకాష్ మాట్లాడుతూ పరీక్షకు 8, 9, 10వ తరగతి విద్యార్థులు నవంబర్ 15 లోపు పాఠశాలల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నవంబర్ 20, 21, 22 తేదీల్లో పరీక్ష ఉంటుందన్నారు.

దీపం-2 పథకం సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బలహీన వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం-2 పథకాన్ని అర్హత కలిగిన జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ పథకంలో ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ నంబరు, రేషన్ కార్డు, ఆధార్ నెంబరుతో అనుసంధానమైన బ్యాంకు ఖాతా ఉన్నవారు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు పొందేందుకు అర్హులని, ఏమైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.

నవంబర్ 3న చెస్ పోటీలు

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 3న జిల్లా స్థాయి అండర్-13 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాదాసు కిషోర్ బుధవారం చెప్పారు. భీమవరం పట్టణంలోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2011 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు నవంబర్ 19 నుంచి మూడు రోజుల పాటు తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 90632 24466 నెంబరులో సంప్రదించాలన్నారు.


యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



విజేతలను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

నూజివీడు: ఈ నెల 29, 30 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలబాలికల యోగాసన పోటీలలో నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 12 మంది ప్రతిభ కనబర్చడంతో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. త్వరలో మహారాష్ట్రలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ స్థాయి యోగాసన పోటీలలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే 14 స్థానాలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు 11 స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవికాంత, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, అభినందించారు.

కార్తీక మాసోత్సవాలకు ముస్తాబు



ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడి ఆలయానికి అలంకారాలు చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. వచ్చే నెల 2 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. దీన్ని పురస్కరించుకుని ఇప్పటికే దేవస్థానం సిబ్బంది ఆలయంలో చలువ పందిరిని నిర్మించారు. అలాగే రంగులతో ఆలయాన్ని, పరిసరాలను ముస్తాబు చేశారు. విద్యుద్దీప అలంకారాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

కాళ్ల బేరానికి రాకపోతే బెదిరింపులే

శ్రుతి మించిన చింతమనేని ఆగడాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: దెందులూరు నియోజకవర్గంలో మద్యం షాపు పెట్టాలంటే ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుమతి తప్పనిసరి. లాటరీలో మద్యం దుకాణం పొందినా కూడా చింతమనేనికి పర్సంటేజీల్లో బేరం కుదరకపోతే అంతే సంగతులు. దెందులూరు మండలంలో మద్యం దుకాణానికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వాసి కంటెం వినోద్‌కుమార్ టెండర్ వేయగా ఒక షాపు అతనికి దక్కింది. అప్పటి నుంచి షాపు పెట్టేందుకు వినోద్‌కుమార్ విశ్వప్రయత్నం చేస్తున్నా, ఏ గ్రామంలోనూ మద్యం దుకాణం పెట్టనీయకుండా ప్రభాకర్ అడ్డుపడుతున్నాడు. ఎక్సైజ్ నిబంధనల మేరకు నెలాఖరుకు దుకాణం పెట్టకపోతే లైసెన్స్ రద్దు చేస్తారనే కారణంతో కంటైనర్ ద్వారా పెదవేగి మండలం ఏడవమైలు రాయి వద్ద లిక్కర్ షాప్ పెట్టి అమ్మకాలు ప్రారంభించాడు. దీన్ని గుర్తించి చింతమనేని ఎక్సైజ్, పోలీసు సిబ్బందిని రంగంలోకి దింపారు. పోలవరం నుంచి అక్రమ లిక్కర్ తెచ్చి అమ్ముతున్నాడని, కంటైనర్‌లో దొంగతనం జరిగిందంటూ ఎక్సైజ్, పోలీస్ అధికారుల సాయంతో కంటైనర్‌ను బుధవారం తెల్లవారుజామున తీసుకుపోయారు.

స్థల వివాదంలో పోలీసుల జోక్యం

ఏలూరు టౌన్: ఏలూరు పాత బస్టాండ్ సమీపంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద మూడు దశాబ్దాలుగా లీజుకు తీసుకున్న స్థలంలో వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్న కుటుంబంపై స్థల యజమాన్ని దౌర్జన్యానికి దిగడంతో బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసు అధికారుల ప్రోద్బలంతోనే స్థల యజమాని తమను బలవంతంగా ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ బాధితులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. ఏలూరుకు చెందిన బచ్చు సత్యనారాయణ 30 ఏళ్లుగా లీజు స్థలంలో పుల్లల అడితి నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేయగా వెంటనే ఖాళీ చేసి వెళ్లడం సాధ్యం కాదని చెప్పారు. స్థల యజమాని లీజుదారులను అక్కడ నుంచి పంపించేందుకు కొంతమంది వ్యక్తులను పంపి దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయానికి వెళ్లి తమ గోడు చెప్పుకున్నారు.

మద్యం దుకాణం తొలగించాలంటూ నిరసన



పోడూరు మండలం పెనుమదంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గంలో మద్యం షాపు తొలగించాలని మహిళలు ఆందోళనకు దిగారు. పోడూరు మండలం పెనుమదంలోని చిట్టితగుంట వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని బుధవారం ఆందోళనకు చేపట్టారు. మద్యం విక్రయిస్తున్న సిబ్బందిని బయటకు పంపించి షాపుకి తాళం వేశారు. ఎక్సైజ్ అధికారులు వచ్చి షాపు తొలగిస్తామని హామీ ఇచ్చే వరకూ ఆందోళన విరమించమని హెచ్చరించారు. హైస్కూల్‌కు వెళ్లే రోడ్డులో మద్యం దుకాణం వల్ల మందుబాబుల ఆగడాలు శ్రుతి మించిపోతున్నాయని.. విద్యార్థులు పాఠశాలకు వెళ్లమంటున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపు ఏర్పాటు చేసి 15 రోజులైందని.. ఈ కొద్ది సమయంలోనే మందుబాబుల దొంగతనాలు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయని వాపోతున్నారు. పది రోజుల క్రితం సమస్యను మంత్రి నిమ్మల, ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, మద్యం షాపు తొలగిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని మహిళలు వాపోయారు. కార్యక్రమంలో ముచ్చర్ల శ్రీనివాసరావు, ముచ్చర్ల శివ, గుబ్బల భాస్కరరావు, బాలం వరలక్ష్మి, బొక్కా ధర్మారావు, గుబ్బల లక్ష్మీనారాయణ, ముచ్చర్ల పేరమ్మ, ముచ్చర్ల సీతామహాలక్ష్మి, శీలం కనకలక్ష్మి, దేవరపు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి అని బాలల సంక్షేమ శాఖ రీజనల్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటపతి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సంస్థలు, వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తులతో పాటు అన్ని కాపీలు జతచేసి నవంబర్ 11 లోగా విజయవాడ కార్యాలయానికి పంపాలన్నారు. సందేహాలకు 94910 63818 నెంబరులో సంప్రదించాలన్నారు.

అప్రమత్తతతోనే ఆనంద దీపావళి

- ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ కసరత్తు
- సురక్షిత దీపావళి-సంతోష దీపావళి పేరిట ప్రచారం



సాక్షి, భీమవరం: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి పండుగలో టపాసులది ప్రధాన పాత్ర. రంగు రంగుల కాంతులతో కనువిందు చేస్తూ.. భారీ శబ్దాలు చేసే వీటిని వెలిగించేందుకు అందరూ ఇష్టపడతారు. బాణసంచా కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వినోదం కాస్తా విషాదంగా మారుతుంది. అప్రమత్తతతో దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణ కోసం బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ×సురక్షిత దీపావళి-సంతోష దీపావళి× పేరిట ప్రచారం చేస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- బాణసంచాను నిప్పు రవ్వలు పడని చోట జాగ్రత్త చేయాలి. మందుగుండు సామగ్రి చిన్న పిల్లలకు దూరంగా ఉంచాలి.
- పిల్లలు, పెద్దలు కాటన్ దుస్తులు ధరించి బాణసంచా కాల్చడం మంచిది. దీని వల్ల దుస్తులు అంటుకునే ప్రమాదాలు తప్పుతాయి
- టపాసులను ఇంట్లో కాకుండా ఆరుబయట కాల్చాలి.
- బాణసంచా కాల్చేటప్పుడు కంట్లో నిప్పురవ్వలు పడకుండా కళ్లజోడు పెట్టుకోవాలి.
- తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే వారి వద్ద ఎక్కువ శబ్దంతో, ఒత్తిడితో పేలే బాంబులు వంటివి కాల్చకూడదు.
- త్వరగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున గడ్డివాములు, తాటాకిళ్లు, చెత్త కుప్పల వద్ద మందుగుండు సామగ్రి కాల్చకూడదు.
- తారాజువ్వలు, రాకెట్స్ తదితర పైకి వెళ్లే సామాగ్రి వల్ల ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. అందువలన వీటిని కాల్చడం తగ్గించటం మంచిది.
- టపాసులను ఒకచోట చేర్చి వాటికి దగ్గరలో దీపాలు వెలిగించడం, కాల్చడం చేయరాదు.
- బాణసంచా కాల్చేటప్పుడు పాదరక్షలు తప్పక ధరించాలి.
- క్రాకర్స్ వెలిగించేటప్పుడు ముఖానికి దూరంగా పెట్టి వెలిగించాలి.
- ఒక బాణసంచాను ఒకరు మాత్రమే వెలిగించాలి. ఇద్దరు ఒకేసారి కాల్చటం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంటుంది.
- బాణసంచా కాల్చే సమయంలో బక్కెట్లలో నీటిని, ప్రాథమిక చికిత్స కిట్లను, రగ్గు, దుప్పటిని దగ్గరలో ఉంచుకోవాలి.
- రద్దీగా ఉండే ప్రదేశాలలో, ఇరుకు ప్రాంతాల్లో, చిన్న సందుల్లో, ఇళ్లకు దగ్గరలో టపాసులు కాల్చవద్దు.
- చిన్న పిల్లలతో సురక్షితమైన చిన్నపాటి టపాసులను పెద్దలు దగ్గరుండి కాల్పించాలి.
- ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగులు తీయొద్దు, నేలపై పడుకుని దొర్లాలి.. లేదా పక్కనున్న వారి సాయంతో రగ్గు/దుప్పటిని ఉపయోగించి మంటలను ఆర్పాలి.
- రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున రహదారులపై బాణసంచా కాల్చరాదు.
- అపార్ట్‌మెంట్లలో నివసించే వారు దీపావళి మందు సామాన్లు కిందికి దిగి కాల్చుకోవటం మంచిది. కారు, స్కూటర్ పార్కింగ్ వద్ద కాకుండా ఆరుబయట కాల్చాలి.
- టపాసులు పేల్చేటప్పుడు కొన్ని పేలకుండా మధ్యలోనే ఆగిపోతాయి, అలాంటి వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం వంటివి చేయకూడదు. వాటిని తిరిగి వెలిగించాలనే ప్రయత్నం చేయకూడదు. అలాంటి వాటిపై నీళ్లు పోయటం ఎంతో ఉత్తమం.
- బయట నుంచి తారాజువ్వలు, రాకెట్లు వంటి వాటి వల్ల అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అపార్ట్‌మెంట్లలో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రైవేటు సంస్థల వారు పండుగ రోజు అన్ని కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.
- గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకు పరిసర ప్రాంతాలలో మందుగుండు సామగ్రి కాల్చరాదు.
- అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో 101, 100, 108 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

జిల్లాలోని ఫైర్ స్టేషన్ల నెంబర్లు

భీమవరం	: 08814-275399
పాలకొల్లు	: 08814-222299
నరసాపురం	: 08814-275399
ఆకివీడు	: 08816-252099
అత్తిలి	: 08819-257977
తణుకు	: 08819-222101
తాడేపల్లిగూడెం	: 08818-221299

అప్రమత్తంగా ఉండాలి



బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని ఫైర్‌స్టేషన్లలోని స్టాఫ్‌ను అలర్ట్ చేశాం. ఎక్కడైనా ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే సమాచారం అందించడం ద్వారా ప్రమాద తీవ్రతను అరికట్టేందుకు వీలుంటుంది.

– జి. శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్

సుందరీకరణతో భీమవరానికి కొత్త రూపు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణానికి సుందరీకరణతో కొత్త రూపు తీసుకురానున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో భీమవరం సుందరీకరణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ప్రత్యేక రూపును సంతరించుకొనేలా భీమవరం పట్టణాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కొన్ని పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. పెద్ద ఎత్తున భీమవరం పట్టణ సుందరీకరణ పనులు చేపట్టి పట్టణ రూపురేఖలను మార్చేదిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వాటర్ ఫౌంటెన్లు, మ్యూజికల్ ఫౌంటెన్లు, విగ్రహాలకు లైటింగ్ ఏర్పాట్లు, వాల్ పెయింటింగ్స్, గ్రీనరీ అభివృద్ధి, రకరకాల పూల మొక్కల ఏర్పాటు, ఈట్ స్ట్రీట్ ఏర్పాటు తదితర పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. నవంబర్ ఒకటి నుంచి క్యారీ బ్యాగుల నిషేధాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాద ఘటనపై కారుమూరి దిగ్భ్రాంతి

తణుకు అర్బన్: తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం శివారులో బుధవారం జరిగిన అగ్నిప్రమాద ఘటన పట్ల మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాణసంచా తయారీ కేంద్రానికి కూలికి వెళ్లిన వారు పిడుగుపాటుకు విగతజీవులుగా మారిపోవడం, ప్రమాదంలో మహిళలు తీవ్రంగా గాయపడడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గాయపడ్డ వారికి సత్వర వైద్యసేవలు అందించాలని మృతుల కుటుంబాలకు, గాయపడ్డ వారికి నష్టపరిహారం అందచేయాలని కోరారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు గురుకుల విద్యార్థులు


విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీహెచ్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. జోనల్ స్థాయిలో ద్వారకాతిరుమలలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో మ్యాథ్స్, సైన్స్ విభాగంలో తమ విద్యార్థులు జె.శుభాకర్, ఎం.నాగరిషి, కే హేమంత్, బి.ఉదయ్ ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గోపాలపురం, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా సమన్వయాధికారిణి ఎస్.భారతి అభినందించారు.

ఇంటర్ వర్సిటీ సౌత్‌జోన్ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థి లోవబాబును అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక చత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న పి.లోవబాబు ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. ఎస్.ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీఏట్ మండపేటలో నిర్వహించిన కబడ్డీ జట్టులో పాల్గొని ప్రతిభ కనబర్చడంతో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టీమ్‌కి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వినయ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థి లోవబాబును అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


ఏలూరు ఇండోర్ స్టేడియంలో కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఏలూరు ఇండోర్ స్టేడియం, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలు బుధవారం ముగిశాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగ, మ్యూజిక్, స్విమ్మింగ్ తదితర అంశాల్లో జట్టు ఎంపిక పూర్తి చేసినట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బి శ్రీనివాస్ తెలిపారు. 200 మంది ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. ఎంపికైన జట్లు నవంబర్ 6 నుంచి 9 వరకూ గుంటూరు, విజయవాడ, మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

బడుగు జీవులపై 'పిడుగు'

- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం
- పిడుగు పడి భారీ విస్ఫోటనం
- ఘటనా స్థలంలోనే ఇద్దరు దుర్మరణం, ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో ఘటన
- బాధితులంతా 'పశ్చిమ' వాసులు
- తణుకులో ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు తరలింపు


తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బంధువుల రోదనలు

క్షతగాత్రులు వీరే..


మందలంక కమలరత్న


కడిమి కుమారి


శీలం లక్ష్మి


చుక్కా పెద్దింట్లు

తణుకు: వారంతా రోజువారీ కూలీలు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు.. దీపావళికి వెలుగులు నింపే బాణసంచా తయారీలో నిమగ్నం అయ్యారు. దురదృష్టవశాత్తూ సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి.. ఆ పిడుగు ధాటికి బాణసంచా కేంద్రంలో విస్ఫోటనం సంభవించింది. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృత్యువాత పడగా మరో ఐదుగురు తీవ్ర గాయాలపాయ్యారు. దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి (50), పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత (35) ఘటనా స్థలంలోనే మృతి చెందగా కడిమి కుమారి (దువ్వ), చుక్కా పెద్దింట్లు (దువ్వ), మందలంక కమలరత్న (రావిపాడు), శీలం లక్ష్మి (రావిపాడు), విప్పర్తి వెంకటేశ్వరరావు (కావలిపురం)లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే 90 శాతం కాలిన గాయాలు ఉండటంతో వీరందరినీ ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అరుణను వివరాలు అడిగి తెలుసుకున్నారు.


గాయాలపాలైన విప్పర్తి వెంకటేశ్వరరావు

బాధితులంతా రోజువారీ కూలీలే

బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తున్న వారంతా రోజువారీ కూలీలే. ఏటా దీపావళికి రెండు నెలల ముందు నుంచి బాణసంచా తయారీ కేంద్రంలో కూలీలుగా పనిచేస్తుంటారు. ఈ కేంద్రంలో సుమారు 20 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు బాణసంచా తయారు చేస్తుంటారు. వీరికి రోజు వారి కూలీ రూ.300 నుంచి రూ.350 వరకు చెల్లిస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

డబ్బులు ఎక్కువ వస్తాయని వెళితే..

తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి భర్త త్రిమూర్తులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. కుమారుడు జయరాజు తాపీ పని చేస్తున్నాడు. కొన్నేళ్లుగా ఐస్‌క్రీం ఫ్యాక్టరీకు వెళుతున్న కుమారి డబ్బులు ఎక్కువ వస్తున్నాయని రెండు నెలలుగా బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తుంది. అనుకోని రీతిలో జరిగిన ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది.

నాలుగు రోజుల నుంచే వెళుతోంది..

పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మందలంక కమలరత్న, వెంకట్రావు దంపతులకు ఇద్దరు కుమారులు. వారు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచే కమలరత్న బాణసంచా తయారీ పనిలోకి వెళుతోంది. అయితే కేంద్రంలో హఠాత్తుగా జరిగిన ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.

రెండు నెలలుగా పనిచేస్తూ..

పెంటపాడు మండలం శీలం లక్ష్మి రెండు నెలలుగా బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తోంది. ఆమె భర్త దుర్గారావు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బాణసంచా కేంద్రంలో జరిగిన విస్ఫోటనంలో లక్ష్మికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

నెలరోజులుగా పనిచేస్తూ..

తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు నెల రోజులుగా బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తోంది. భర్త ముసలయ్య కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సాధారణ రోజుల్లో పెద్దింట్లు వంట పనులకు వెళుతూ ఉంటుందని కుమార్తె ప్రసన్న ప్రవల్లిక చెబుతున్నారు.

ఏడేళ్ల క్రితం తల్లిదండ్రులు.. ఇప్పుడు భార్య

తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు రామ శివాజీ, శ్రీవల్లి దంపతులు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు 9వ తరగతి చదువుతున్నాడు. తణుకులోని వెంకట్రాయపురంలో వీరు నివాసం ఉంటున్నారు. శివాజీ గతంలో తణుకు మండలం దువ్వ గ్రామంలోని వయ్యేరు గట్టు కింద బాణసంచా తయారీ కేంద్రాన్ని నిర్వహించేవారు. సుమారు ఏడేళ్ల క్రితం దువ్వ గ్రామంలోని తన నివాసంలో బాణసంచా నిల్వలు పేలిపోవడంతో శివాజీ తల్లిదండ్రులు సజీవదహనం అయ్యారు. అయినప్పటికీ తయారీ కేంద్రం కొనసాగిస్తున్నారు. గతేడాది పశ్చిమ గోదావరి జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలకు అప్పటి కలెక్టర్ పి.ప్రశాంతి అనుమతులు ఇవ్వలేదు. దీంతో శివాజీ దువ్వ సమీపంలోని సూర్యారావుపాలెం గ్రామంలో పొలాల వద్ద షెడ్ ఏర్పాటు చేసుకుని బాణసంచా తయారీ ప్రారంభించారు. ఈ ఏడాది కూడా అన్ని అనుమతులు తీసుకుని మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నారు. గత నెల రోజులుగా శివాజీకి సహాయంగా అతని భార్య శ్రీవల్లి తయారీ కేంద్రంలో పనులు చూసుకుంటోంది. దురదృష్టవశాత్తూ బుధవారం సాయంత్రం కొబ్బరిచెట్టుపై పిడుగుపడి దాని విస్ఫోటనం కారణంగా బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో శివాజీ భార్య వేగిరోతు శ్రీవల్లి ప్రాణాలు కోల్పోయింది. దీంతో కుటుంబంలో తల్లిదండ్రులతోపాటు భార్యను కూడా తాను నమ్ముకున్న కుటీర పరిశ్రమ మింగేయడం గమనార్హం.

ఆ ఇంట్లో మరో విషాదం

కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు గత కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. సీజన్ పూర్తయ్యాక ఇటుకల బట్టీలో పనిచేస్తుంటారు. వెంకటేశ్వరరావు, కుమారి దంపతులకు కుమారుడు, కుమార్తె కాగా కుమార్తె లక్ష్మీశోభకు గొల్లపల్లి సురేష్‌తో వివాహం చేశారు. అయితే 20 రోజుల క్రితమే అల్లుడు సురేష్ గుండెపోటుతో మృతి చెందాడు. ఇంతలోనే ఆ ఇంట్లో మరో ప్రమాదం ఎదురైంది. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా..!

- పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్ చేతివాటం
- ఫోర్జరీ సంతకాలతో రూ.62 లక్షల వరకు స్వాహా

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలోని ఆరోగ్యశ్రీ నిధులను స్వాహా చేశాడు జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి. గతంలో పనిచేసిన ఇద్దరు ఆసుపత్రి సూపరింటెండెంట్ల సంతకాలు ఫోర్జరీ చేసి సుమారు రూ.62 లక్షలు కాజేసినట్లు తెలుస్తోంది. గతంలో డా. సి గీతాకుమారి సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆమె సంతకాలు ఫోర్జరీ చేసి సదరు ఉద్యోగి రూ.28 లక్షలు డ్రా చేసినట్లు సమాచారం. ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి వచ్చిన ఆరోపణల కారణంగా గీతాకుమారిని సూపరింటెండెంట్ బాధ్యతలనుంచి తప్పించారు. ఆమె స్థానంలో డా.ప్రభాకరరావు సూపరింటెండెంట్‌గా వచ్చారు. ఆయన ఇటీవల గుండెపోటుతో మరణించారు. అయితే ఆయన సంతకం కూడా ఫోర్జరీ చేసి రూ.34 లక్షలు డ్రా చేసినట్లు సమాచారం. ప్రభాకరరావు మరణం తరువాత ఇన్‌చార్జిగా డా.రవికుమార్ బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వహిస్తున్నారు. ఈ నిధులపై ఆరా తీసి తేడాలు జరిగినట్లు నిర్ధారించారు. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిధులు స్వాహా చేసినట్లు అనుమానిస్తున్న ఆ ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవికుమార్‌ను వివరణ కోరగా ఆరోగ్య శ్రీ నిధులు దారి మళ్లిన విషయం వాస్తవమేనన్నారు. అయితే ఎంత నిధులు డ్రా చేశారో తెలియదని, దీనిపై పోలీస్ కేసు పెట్టినట్లు చెప్పారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

భీమవరం : మహిళ హత్యాయత్నం కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ బుధవారం చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం పట్టణంలోని శ్రీరామపురం ప్రాంతానికి చెందిన భూపతిరాజు ఉదయ్‌శేఖర్‌రాజు, మధు 2013లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు గగన్‌వెంకట్ లలిత్‌క్రిష్ వర్మ ఉన్నారు. భార్య, భర్తల మధ్య గొడవలు రావడంతో 2016లో విడిపోయారు. దీనితో 2022లో భీమవరం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం కేసు కోర్టులో విచారణలో ఉంది. టూటౌన్ ప్రాంతంలో మధు తన కుమారుడితో కలిసి నివాసముంటోంది. ఈనెల 27వ తేదీన ఆమె నివాసముంటున్న ఇంటి వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి ఆమెను పిలవడంతో ఇంటిలోంచి బయటకు రాగానే ఒక వ్యక్తి చాకుతో దాడి చేసేందుకు యత్నించాడు. ఆపదను గ్రహించిన మధు బిగ్గరగా కేకలు వేస్తూ వారిలో ఒకరిని పట్టుకునే ప్రయత్నం చేయగా అతని చొక్కా జేబులోనుంచి ఆధార్‌కార్డు పడిపోగా చాకు కిందపడేసి అంతా పారిపోయారు. హత్యాయత్నం జరిగిన తరువాత భయంతో ఆమె గణపవరం మండలం అర్ధవరం గ్రామంలోని తల్లివద్దకు వెళ్లారు. హత్యాయత్నం ఘటనపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త భూపతిరాజు ఉదయ్‌శేఖర్‌రాజుతోపాటు అతని బంధువులు రవికుమార్‌రాజు, లక్ష్మి, బాపిరాజుపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనితో కేసు దర్యాప్తు చేసి ఉదయ్‌శేఖర్‌రాజుతోపాటు కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం ముంజులూరుకు చెందిన కె నాగవెంకటవీర్రాజు, గుడివాడకు చెందిన కర్రా లాజర్, గుల్లపల్లి పోతురాజు, యలమర్తి నాని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బంగారుగూడెనికి చెందిన షేక్ సర్వర్‌పాషాలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

బట్టలు ఆరవేస్తుండగా కరెంట్ షాక్ తగిలి..

యలమంచిలి: బట్టలు ఆరేస్తుండగా కరెంట్ షాక్ తగిలి ఓ వివాహిత మృతి చెందింది. ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపిన వివరాలివి. యలమంచిలి మండలం దొడిపట్ల గ్రామానికి చెందిన ముచ్చర్ల భాగ్యలక్ష్మి (33) గ్రామంలోని జగనన్న కాలనీలో ఉంటున్నారు. వారి డాబా ఇంటి మీదుగా హెచ్‌టీ విద్యుత్ తీగలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం డాబాపై బట్టలు ఆరేస్తుండగా హెచ్‌టీ విద్యుత్ తీగలు ఆకర్షించడంతో ఆమె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. భర్త ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు. భాగ్యలక్ష్మి మృతదేహానికి బుధవారం శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

హైవే పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు


మీర్జాపురంలో హైవే పక్కనే ఏర్పాటు చేసిన మద్యం షాపు

నూజివీడు: నూజివీడు మండలం మీర్జాపురంలో నిబంధనలకు విరుద్ధంగా హైవేపైనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హైవేకు 250 మీటర్ల దూరంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలి. కానీ మచిలీపట్నం - కల్లూరు - నూజివీడు (నేషనల్ హైవే 216 హెచ్) రహదారి పక్కనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. సంబంధిత ఎక్సైజ్ అధికారులు ఈవిషయం పట్టించుకోకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డీఈఓ నారాయణకు అభినందనలు


డీఈఓ నారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అపుస్మా నాయకులు

భీమవరం: జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఈ నారాయణను రాష్ట్ర అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్కినేని కృష్ణకిషోర్, రామకృష్ణ, కోశాధికారి చిరంజీవి, నాగేశ్వరరావు, వంశీరవికుమార్ తదితరులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను కలసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో దూకిన వ్యక్తి కోసం గాలింపు

భీమవరం: పట్టణంలోని కాలిబాట వంతెన పైనుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోనికి వ్యక్తి దూకినట్లు సమాచారం అందడంతో కాలువ పరిసరాల్లో గాలించినట్లు భీమవరం ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు బుధవారం చెప్పారు. వ్యక్తి కాలువలోనికి దూకినట్లు తెలియడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టగా ఆచూకీ లభించలేదన్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సూర్యప్రకాశరావు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్ముతున్న అరమల్ల నాగేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐ పి అశోక్, ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఆర్‌వీఎల్ నరసింహారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి


పట్టణంలోని రోడ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం: పట్టణంలోని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మునిసిపల్ అధికారులను కమిషనర్ బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆదేశించారు. మునిసిపల్ మేనేజర్ రవిసుధాకర్, శానిటరీ ఇనస్పెక్టర్లు శ్రీమన్నారాయణ, సోమేశ్వరరావు, వార్డు శానిటరీ సెక్రటరీలతో మాట్లాడారు. ట్రేడర్లు, లైసెన్సుదారులు లైసెన్సు ఫీజులు, పన్నులు మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మాత్రమే చెల్లించాలన్నారు.

కడియద్దలో సివిల్ రైట్స్ డే


మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద పౌర హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ కాశీకృష్ణ పౌర హక్కుల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రొక్కాల నాగబుజ్జి, మాజీ సర్పంచ్ నేకూరి కిరణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వో ఆదాం రాజు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్యూరిఫయర్ బహుకరణ


ప్యూరిఫయర్ బహుకరించిన నిట్ ప్రయత్నం క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లోని ప్రయత్నం క్లబ్ విద్యార్థులు ఔదార్యంతో బుధవారం తణుకులోని జీఎస్సీ చిల్డ్రన్ హోంకు వాటర్ ప్యూరిఫయర్‌ను బహుకరించారు. బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హాస్టల్ సీనియర్ అసిస్టెంటు వెంకట దినేష్ సౌజన్యంతో ఈ కార్యక్రమం చేశారు. విద్యార్థులను నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తదితరులు అభినందించారు.

ఉమా చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఉమా చంద్రశేఖర స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో బుధవారం మాస శివ రాత్రి పురస్కరించుకుని ఉమా చంద్రశేఖర్ స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారికి పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, పూర్వాధ్యక్షుడ పేరూరి కాశయ్య, ఆర్యవైశ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మారంపల్లిలో ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మారంపల్లి గ్రామంలో బుధవారం ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి ఆయుర్వేదం విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది టి.అన్నపూర్ణ, కే.బంగారం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన కమిషనర్


ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానోను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: గూడెం ఆర్డీఓగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఖతీబ్ కౌసర్‌భానోను మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మునిసిపాలిటీకి ప్రత్యేక అధికారిగా కూడా ఆర్డీఓ వ్యవహరిస్తారు.

పేదలకు అప్పుల తిప్పలు

- సంక్షేమం కోసం ఎదురుచూపులు
- చేతిలో చిల్లిగవ్వలేక వడ్డీ వ్యాపారుల కోసం వెతుకులాట
- గత జగన్ ప్రభుత్వంలో రూ. 3300 కోట్ల సంక్షేమం


తణుకులో గత జగన్ ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

తణుకు అర్బన్: చేద్దామంటే పనుల్లేవ్.. చేతిలో చిల్లిగవ్వ లేదు ఇది పేదల ప్రస్తుత దుస్థితి. రోజు గడవడం కష్టంగా మారిన నేటి పరిస్థితిలో ప్రజానీకం అల్లాడిపోతున్నారు. తమ కుటుంబాలను పోషించుకునేందుకు అప్పులు చేస్తూ తిప్పలు పడుతున్నారు. తోచిన కాడికి అప్పులు చేసి పొట్ట నింపుకోవాల్సిన రోజులు దాపురించాయని పేదవర్గాలు గగ్గోలు పెడుతున్నారు. గత ఐదేళ్ల జగన్ సంక్షేమ పాలనతో మూడుపూటలా కడుపునిండా భోజనం చేశామని కానీ నేడు కష్టపడి పనిచేసి పొట్టపోసుకుందామంటే పనుల్లేవని అలాగని కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమం అందిస్తుందా అంటే అదీలేదంటూ అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ ఏదో క పథకం ద్వారా ఏడాది పొడవునా సంక్షేమం రూపంలో నగదు బ్యాంకు ఖాతాలకు జమయ్యేదని కానీ నేడు పెంచిన పింఛను తప్ప మరే ఇతర ప్రో త్సాహం ప్రజలకు ఇవ్వలేదంటూ వాపోతున్నారు. ఒకపక్క ఇళ్లు గడవడమే కష్టంగా ఉందంటే దానికితోడుగా నిత్యావసర సరుకులు, నూనెలు, కూరగాయల ధరలు కొండెక్కడంతో పేదల వెతలు వర్ణనాతీతంగా మారాయి.

జగన్ సమయంలో మహిళలు ఆర్థికంగా నిలబడ్డారు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పాలనతో మహిళలు ఆర్థికంగా ఎదిగారు. అప్పులు చేసే స్థితి నుంచి అప్పులు ఇచ్చే స్థాయికి చేరారు. సంక్షేమం ద్వారా వచ్చిన లబ్ధితో మహిళలు చిన్నపాటి వ్యాపారాలు చేసుకుని నేడు మంచి స్థితిలో నిలిచారు. సంక్షేమంతో రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు శక్తి పెరిగి దేశంలోనే నంబరు 1 స్థానంలో ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. కూటమి ప్రభుత్వ నాలుగు నెలల కాలంలో పేదవర్గాలు అప్పుల కోసం వెతుకులాడుతుండడం బాధాకరంగా ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో వ్యవహరించి ప్రతి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

విస్తరిస్తున్న వడ్డీ వ్యాపారం..

చేతిలో రూపాయి ఆడక ఇళ్లు గడవాలంటే డబ్బు కావాలనే ఉద్దేశ్యంతో పేదవర్గాలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన గత్యంతరం ఏర్పడింది. అవసరం మేరకు రూ. 2 నుంచి రూ. 10 వరకు వడ్డీకి వేల రూపాయిలు వడ్డీకి తెచ్చుకుని ఇళ్లు గడపాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా కాల్ మనీ వ్యవస్థ కూడా అమాయకుల రక్తాన్ని పిండేసే పరిస్థితి దాపురించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జగన్ ప్రభుత్వ హయాంలో రూ. 3300 కోట్ల సంక్షేమం..

గత జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో సుభిక్షంగా నడిచేదని ప్రతి పేద కుటుంబం కూడా సంక్షేమం ద్వారా వచ్చే లబ్ధితో ఆర్థిక ఇబ్బందులకు లోనుకాకుండా ఉండే పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం రాగానే నేడు అప్పుల కోసం అల్లాడాల్సిన దుస్థితితో పేదవర్గం అతలాకుతలమవుతున్నారు. విద్య, వైద్యంతోపాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, కాపు నేస్తం, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, లా నేస్తం, వాహనమిత్ర, ఈబీసీ నేస్తం, జగనన్న తోడు వంటి పథకాలు పేదవర్గాలకు అండగా నిలిచాయి. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయిన పరిస్థితి అప్పట్లో ఉండేది.

పేదవర్గాలు అల్లాడుతున్నాయి



ఆంధ్రప్రదేశ్‌లో కరువు వచ్చిందా అనేట్లుగా పేదవర్గాలు కూటికోసం అల్లాడుతున్నారు. ఎటువంటి సంక్షేమం అందక దళితవర్గాలు రోజు గడపటానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్బులు అప్పు ఇచ్చే వారికోసం ప్రతి గుమ్మం ఎదురుచూసే పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులను దూషించడం, దళిత నాయకులను అవమానించడానికే ప్రాధాన్యతనిస్తున్నారు కానీ పేదవర్గాలకు సంక్షేమం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచించడంలేదు.

– పొట్ల సురేష్, న్యాయవాది, ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు

గతమెంతో ఘనం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పరిపాలన పేద, ధనిక బేధాల్లేకుండా సాగింది. జగనన్న ఇచ్చిన సంక్షేమ లబ్ధి పేదవర్గాల ఇళ్లలో కాంతులు నింపింది. నేడు మరల పేదరికం పుంజుకునే పరిస్థితితో నిత్యం ఆకలికేకలు, ఆర్థిక లావాదేవీలతో ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలను చూడాల్సివస్తోంది. అప్పు దొరికితే కొన్ని రోజులు బతకవచ్చనే హీనస్థితి మొదలైంది.

– నూకల కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు

అప్పులకోసం పేదల ఎదురుచూపులు



కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా ఎటువంటి సంక్షేమం అందకపోవడంతో పేదవర్గాలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క పనులు లేక, మరొక పక్క కిరాణా సరుకులు, నూనెలు, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చోడంతో ప్రజాజీవనం ప్రతికూలంగా మారింది. అప్పులిచ్చే వారికోసం పేదవర్గాలు ఎదురుచూసే పరిస్థితి తిరిగి వచ్చింది.

– నమ్మి ధనలక్ష్మి, తణుకు

అయ్యప్ప ఆలయానికి పంచలోహ విగ్రహాలను సమర్పించిన భక్తులు


తణుకులో దేవతామూర్తుల విగ్రహాలను అందిస్తున్న దాతలు

తణుకు అర్బన్: తణుకు జాతీయ రహదారి సమీపంలోని శ్రీధర్మ శాస్తా పంచాయతన అయ్యప్ప దేవాలయానికి భక్తులు పోలిశెట్టి వెంకటేశ్వరరావు, కాంతారావు, అచ్యుత చంద్రశేఖర్‌లు విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు, కామ కామేశి, అయ్యప్ప పంచలోహ విగ్రహాలను సమర్పించారు. విగ్రహాలకు గురుస్వాములు చలపతి, చల్లా భరణికుమార్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా పంచలోహ విగ్రహాలకు జలాభిషేకం, ధాన్యాభిషేకం, దాన్యాదీవాసం, పుష్పాభిషేకం వంటి పూజలు శాస్త్రోక్తకంగా నిర్వహించి ఆలయంలో ఉంచారు. ఈ పూజాధికాల్లో అధిక సంఖ్యలో మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి


ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య ప్రగతి కార్డులను అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: పిల్లల ఆరోగ్యసంరక్షణ పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెల్త్ అసిస్టెంట్ స్వామి అన్నారు. బుధవారం అత్తిలి మండలం ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శిశువు ఆరోగ్య ప్రగతి రికార్డులను అందజేసారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆప్తవాజపేయమ్ యాగ నిర్వహణపై ర్యాలీ


తణుకులో కోలాట బృందంతో గురువులు

తణుకు అర్బన్: దీపావళి అమావాస్య మొదలుకొని కార్తీక పౌర్ణమి వరకు తణుకు శివారు పాలంగిలో నిర్వహించనున్న ఆప్తవాజపేయమ్ మహా యాగంలో భక్తులంతా హాజరుకావాలని కోరుతూ బుధవారం తణుకులో కోలాటం, భజన బృందాలతో ర్యాలీ నిర్వహించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీచండీ, మహా రుద్ర పూర్వక కోటి దీపోత్సవ, కోటి కుంకుమార్చన సహిత ఆప్తవాజపేయమ్ మహా యాగానికి భక్తులంతా అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. ముందుగా శ్రీకేశవస్వామి ఆలయం నుంచి ప్రారంభించిన ర్యాలీ రాష్ట్రపతి రోడ్డు మీదుగా వేంకటేశ్వర థియేటర్ ప్రాంతం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కేశవస్వామి ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, యాగ కన్వీనర్ పచ్చిపులుసు వీరవ వెంకట సత్యనారాయణ, యాగద్రష్ట జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ, చల్లా శ్రీనివాస శర్మ, చిలుకూరి శివరామ్, కొలగాని కృష్ణవేణి, ఆర్యవైశ్య మహిళా కోలాట బృందం, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు తెలిపారు. పట్టణంలో బుధవారం కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనాలు, ధరించకపోతే జరిగే అనర్థాలపై చర్చించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు శాతం పెరుగుతుందని చెప్పారు. ప్రతి వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలని పలు సూచనలు చేశారు. మైనర్ డ్రైవింగ్ చేస్తే వాహన యజమానులకు కూడా శిక్ష పడుతుందని హెచ్చరించారు. ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన సంబంధిత పత్రాలను తప్పక కలిగి ఉండాలన్నారు. అదే విధంగా మద్యం, డ్రగ్స్, గుట్కాలు తదితర ఉత్పత్తులు తీసుకోకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


అత్తిలిలో అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దశిక వంశీ

అత్తిలి: బాణ సంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. మీకోసం కార్యక్రమంలో వచ్చిన ప్రజా విజ్ఞప్తులపై బుధవారం వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అత్తిలి మండలంలో రెండు మిల్లర్లతో పాటు రైతులు తమకు ఇష్టమైన ఇతర ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించి విక్రయించుకోవచ్చన్నారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి శామ్యూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే 112కు డయల్ చేయండి


మాట్లాడుతున్న ఇనస్పెక్టర్ అహ్మద్ ఉన్నీసా

తాడేపల్లిగూడెం: విద్యాలయాల వద్ద ఆకతాయిలు వేధిస్తుంటే 112 నంబరుకు డయల్ చేయాలని జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఇనస్పెక్టర్ అహ్మద్ ఉన్నీసా తెలిపారు. బుధవారం పట్టణంలోని వాసవీ జూనియర్ కళాశాల విద్యార్థినులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ మహిళల కోసం రూపొందించిన ప్రత్యేక చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టంపై వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన మహిళా పోలీసు స్టేషన్ సిబ్బంది ద్వారా విద్యాసంస్థల వద్ద గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. సెల్ ఫోన్ ద్వారా సోషల్ మీడియా ద్వారా కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకొనే నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటర్నెట్‌లో అనవసర విషయాలపై ఆసక్తి పెంచుకోవడం మంచిది కాదన్నారు. పరిసర ప్రాంతాలలో ఎవరైనా సైబర్ నేరాలకు పాల్పడితే 1930 నంబరుకు సమాచారం అందజేయాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు

తణుకు టౌన్: ఈనెల 26,27 తేదీలలో భీమవరం బీవీ రాజు కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ కం యూనివర్సిటీ చదరంగం ఎంపిక పోటీలలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. విజేతలైన విద్యార్థినీలను, పీడీ ఎం రత్నకుమారిలను చిట్టూరి వెంకట కృష్ణారావు, అభినందించారు.

హాస్టల్ సందర్శించిన హౌసింగ్ పీడీ

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల హాస్టల్‌ను హౌసింగ్ శాఖ పీడీ పిచ్చయ్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిపేర్‌లో ఉన్న మరుగుదొడ్లు, డోర్లు పై ఆరా తీశారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్, వర్కు ఇనస్పెక్టర్‌లు జయరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన తణుకు క్రీడాకారులు


తణుకులో బంగారు పతకాలు సాధించిన స్కేటింగ్ క్రీడాకారులతో కోచ్ లావణ్య.

తణుకు అర్బన్: జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో తణుకు క్రీడాకారులు సత్తాచాటి బంగారు పతకాలు సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ లావణ్య తెలిపారు. ఈనెల 23వ తేదీన ఏలూరులో ఆర్ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కేటింగ్ పోటీల్లో తణుకు మునిసిపల్ స్కేటింగ్ పార్క్ స్కేటింగ్ రేంజర్స్ అకాడమీ క్రీడాకారులు ఎం.అన్విక, కె.గేయదీపిక, వి.శ్రీమన్నారాయణ పాల్గొని వివిధ కేటగిరీల్లో 8 బంగారు పతకాలు సాధించినట్లు వివరించారు. వచ్చేనెల 6వ తేదీన కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ చిన్నారులు ఎంపికైనట్లు తెలిపారు.

డీఆర్‌జీలో ఘనంగా పటేల్ జయంతి

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు అధ్యాపకులు మట్లాడారు. దేశ ఐక్యతకు వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు విక్టర్ ప్రేమ్‌కుమార్, సుంకర గోపాల్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వై.నూకరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ వై.నూకరాజు అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయిలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రైతులు సాగు చేపట్టే ముందు భూమిలో నవధాన్యాలను వేసుకోవాలన్నారు. నవధాన్యాలు మొక్క దశకు వచ్చిన తర్వాత భూమిలో దున్నడం ద్వారా సారవంతంగా తయారవుతుందన్నారు. తద్వారా కలుపు తగ్గుతుందని రైతులు సైతం పేర్కొంటున్నారన్నారు. నవధాన్యాల ద్వారా పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రకృతి సాగు ప్రయోజనాలను రైతులకు వివరించి, డివిజన్‌లో ఐదు వేల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు తనకున్న భూమిలో కొంత భాగంలో ప్రకృతి విధానంలో సాగు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయాధికారులు ఆర్ఎస్.ప్రసాద్, పార్థసారధి, ప్రసాద్ పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి


మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పని స్థలాలలో మహిళలకు భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ అన్నారు. పట్టణంలోని శేషమహల్ థియేటర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో దాన వర ప్రసాద్ మాట్లాడుతూ కలకత్తా ఆర్జీకార్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్య, అయోధ్యలో పారిశుద్ధ్య కార్మికులపై జరిగిన సామూహిక అత్యాచారం, ఏపీలో అత్తా, కోడలిపై జరిగిన అత్యాచారం, పసి పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు తదితర సంఘటనలపై దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలు తాము పొందిన ఉద్యోగాలను, ఉపాధిని కాపాడుకోవాలంటే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, చట్టాలని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.ఉదయరాజు, పల్లి రాజేష్, వెంకటేశ్వరరావు, యేసు, అసిన్ భాష, రాజు, వై.శ్రీను, భయ్యా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులు కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు బుధవారం తెలిపారు. గుంటూరు జిల్లా బాపట్లలో నవంబరు 16వ తేదిన జరగనున్న కబడ్డీ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ జిల్లా సమన్వయాధికారి ఎస్.భారతి, ప్రిన్సిపల్ రాజారావు, ఎస్.రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన ఉపవాస పండుగలు


మాట్లాడుతున్న దైవసేవకులు మోజస్ ప్రవీణ్

పెంటపాడు: క్రీస్తుకు విధేయులుగా జీవించాలని తణుకుకు చెందిన ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పరసా మోజస్ ప్రవీణ్ పేర్కొన్నారు. మండలంలోని బి. కొండేపాడు గ్రామంలో గత మూడురోజులగా సియోను ప్రార్థనా మందిరంలో జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు బుధవారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా దైవసేవకులు మోజస్ ప్రవీణ్ మాట్లాడుతూ దైవుని ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారానే దైవత్వం సిద్ధిస్తుందన్నారు. ప్రతి క్రైస్తవ విశ్వాసి బైబిలును క్రమంగా చదివి యేసుక్రీస్తు మానవాళి కోసం పలికిన ప్రవచనాలను గైకొనాలన్నారు. సంఘ కాపరి పాస్టర్ ఎం. సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ మూడు రోజుల సమావేశాలలో నిజామాబాద్‌కు చెందిన బ్రదర్ రమేష్, పాస్టర్ ఎం. జోసఫ్, సువార్త గాయకులు సాలోమోన్‌రాజు పాల్గొన్నారు.